
# కరీంనగర్‌కు మహర్దశ

కరీంనగర్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. మంగళవారం జిల్లా ప్రజాప్రతినిధులు, టాటా కన్సల్టెన్సీకి చెందిన ముగ్గురు ప్రతినిధులు, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం ప్రగతిభవన్‌లో కలిసి మానేరు రివర్‌ఫ్రంట్ అభివృద్ధి గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మాట్లాడుతూ కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర అభివృద్ధి కోసం ఎన్ని నిధులు ఇచ్చినా సద్వినియోగం కావడం లేదని, ప్రణాళికాబద్ధంగా నిధులు వెచ్చించకపోవడమే ఇందుకు కారణమన్నారు. తాను ఇచ్చిన హామీ మేరకు కరీంనగర్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ఫోన్‌చేసి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని, దీనికి హాజరుకావాలని ఆదేశించారు. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

6





- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- మానేరు రివర్ ఫ్రంట్ పనులకు శ్రీకారం
- నగర సుందరీకరణ పనుల పర్యవేక్షణకు ఓఎస్డీ నియామకం
- రేపు ప్రగతిభవన్‌లో ప్రత్యేక సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

# కరీంనగర్‌కు మహర్దశ



(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్‌కు మహర్దశ పట్టనున్నది. తన కలల కరీంనగర్‌ను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నడుం బిగించారు. వెంటనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయడంతోపాటు అభివృద్ధి, నగర సుందరీకరణ పనులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని (ఓఎస్‌డీ) నియమించాలని చీఫ్ సెక్రెటరీకి ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఒకటి రెండురోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఈ విషయమై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం మంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్, ఎంపీ బి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టాటా కన్సల్టెన్సీకి చెందిన ముగ్గురు ప్రతినిధులు, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి మానేరు రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

**● అభివృద్ధి పనులపై సీఎం అసంతృప్తి**

కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారని సమాచారం. నగర అభివృద్ధి కోసం ఎన్ని నిధులు ఇచ్చినా సద్వినియోగం కావడం లేదని, ప్రణాళికాబద్ధంగా నిధులు వెచ్చించకపోవడమే ఇందుకు కారణమని సీఎం అభిప్రాయపడ్డారు. తాను సీఎంగా కరీంనగర్‌కు వచ్చినపుడు ఇచ్చిన హామీ మేరకు కరీంనగర్ సుందరనగరంగా తీర్చిదిద్దాలని, అందుకోసం ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధిచేయడానికి ముందుగా మానేరుకు ఇరువైపులా ఉన్న (బండ్స్) కట్టలను శుభ్రంచేసి అందుబాటులో ఉన్న భూమి ఎంతో నిర్ధారించుకోవాలన్నారు. పట్టణంలోని పార్కులు, కూరగాయల మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, రోడ్ల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలని కూడా సీఎం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరీంనగర్ అభివృద్ధి గురించి తనను కలిసిన నేతలతో చర్చించిన ముఖ్యమంత్రి కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ఫోన్‌చేసి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశామని, దీనికి హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ మేయర్, కమిషనర్, పోలీసు కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, సానిటరీ అధికారి, రోడ్లు,భవనాలు, విద్యుత్ శాఖల అధికారులు, జిల్లా అటవీశాఖ అధికారి హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

**● సీఎం హామీలు.. అమలు**

ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కేసీఆర్ 2014 ఆగస్టు 5న కరీంనగర్‌కు తొలి పర్యటనగా వచ్చారు. ఈ సందర్భంగా 46 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న కరీంనగర్ సిటీ రినోవేషన్ (కేసీఆర్) ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పగిలిన అద్దం ముక్కల్లా మారిన కరీంనగర్‌ను లండన్, న్యూయార్క్ తరహాలో తీర్చిదిద్దుతానని, దీనికి తానే ఇన్‌చార్జిగా ఉంటానని ప్రకటించారు. మానేరు డ్యాం వద్ద గల 207 ఎకరాల భూమిలో మైసూర్ తరహా బృందావన్ గార్డెన్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ 107 ఎకరాల భూమి నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో ఉందని, 100 ఎకరాలు ఇతరులకు కేటాయించామని, వాటిని రద్దుచేస్తామన్నారు. అవసరమైతే మరో 100 ఎకరాల భూమిని సేకరిస్తామని ప్రకటించారు. మానేరు తీరంలో డిన్నర్ క్రూసింగ్ బోట్ (నీళ్లలో తేలియాడే పడవ) ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనిలో జన్మదిన వేడుకలు, చిన్న చిన్న ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. బృందావన్ గార్డెన్ వద్ద అవసరమైతే దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం విల్లాస్‌ను నిర్మిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్, జిల్లా పరిషత్ కార్యాలయాలు, కళాభారతిని కలిపి మల్టీ జోనల్ కాంప్లెక్స్ నిర్మించి మిగతా శాఖలను ఒక్కచోటనే ఏర్పాటు చేయిస్తామన్నారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కరీంనగర్‌కు అదనంగా ట్రాఫిక్ సీఐ పోస్టును, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు 50 కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు కరీంనగర్‌లో అదనపు ట్రాఫిక్ సీఐని నియమించగా, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్నీ ఏర్పాటు చేశారు.

**● భారీగా నిధుల మంజూరు**

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన విజ్ఞప్తి మేరకు 14.2 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి, వాటిస్థానంలో విద్యుత్ టవర్ల ఏర్పాటుకు 22 కోట్లను మంజూరు చేశారు. రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు, డక్టులతోపాటు చెక్కెడ్ టైల్స్‌తో కూడిన ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి 33 కోట్లను కేటాయించారు. ఆ తర్వాత 140 కోట్లు సదాశివపల్లి సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం, 60 కోట్ల రూపాయలు కరీంనగర్-ఎలగందల్ పాత రోడ్డు పునరుద్ధరణకు, కోటి 60 లక్షలు ఎల్ఎండీ ఆనకట్టపై ఉన్న బీటీ రోడ్డుకు, 196 కోట్ల రూపాయలు మానేరు రివర్‌ఫ్రంట్‌కు దశలవారీగా ప్రభుత్వం విడుదల చేసింది. 2016-17లో 100 కోట్లు, 2017-18లో 100 కోట్ల రూపాయలను కరీంనగర్ నగరపాలక సంస్థకు మంజూరు చేశారు.

**● పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి**

కోట్లాది రూపాయలను మంజూరు చేస్తున్నప్పటికీ కూరగాయల మార్కెట్లలో రైతులు కింద కూర్చొని అమ్మకోవడం, పార్కులు వినియోగంలోకి లేకపోవ డం, శ్మశానవాటికలను అభివృద్ధి చేయకపోవడంపై సీఎం కేసీఆర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. వీటన్నిటిని వేగంగా పూర్తిచేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని 2019లోగానే సుందర నగరంగా తీర్చిదిద్దాలని, ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి నియమాకం అవసరమని సీఎం భావించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీని కరీంనగర్ పట్టణంతోపాటుగా సమీపంలోని ఏయేగ్రామాలతో ఏర్పాటు చేసేందుకు అవసరమైన సమాచారాన్ని తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించడంతో బుధవారం జరిగే సమావేశంలో ఓఎస్డీ నియామకం జరిగే అవకాశముంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీకి కూడా పూర్తి రూపం రానుంది.

# మనోహరంగా మానేరు

- రివర్ ఫ్రంట్ అభివృద్ధికి కేసీఆర్ నిర్ణయం

హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మానేరు డ్యామ్ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇది అద్భుతంగా ఉందని పర్యాటకులు భావించాలంటే అక్కడ రూపొందించాల్సిన వివిధ అంశాలపై ఆలోచన చేయాలన్నారు. మంగళవారం ప్రగతి భవన్‌లో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కరీంనగర్ సమీపంలోని ప్రాంతాలకు వచ్చేవారు తప్పకుండా కరీంనగర్‌ను, సమీపంలోని రివర్ ఫ్రంట్‌ను సందర్శించేలా సదుపాయాలు కల్పించాలన్నారు. హైదరాబాద్ పర్యాటక స్థలాల్లో కూడా లేని ఆకర్షణలు కరీంనగర్‌లో ఉండాలన్నారు. టాటా బృందానికి చెందిన షనేశ్, సూర్యప్రకాష్‌లు సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చారు. మానేరు డ్యామ్‌ను పర్యాటక కేంద్రంగా కరీంనగర్ పట్టణాన్ని టూరిస్ట్ హబ్‌గా రూపొందించే ఉద్దేశ్యంతో తామీ ప్రాజెక్టును రూపొందించామని టాటా గ్రూప్ ప్రతినిధులు సీఎంకు వివరించారు. మరోసారి ప్రాజెక్టును పునఃపరిశీలించి మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. రాగి, వేప, సిల్వర్ ఓక్‌లాంటి చెట్లను విరివిగా పెంచాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి Wed, 17 May 2017
epaper.andhrajyothy.com/